క్లుప్తంగా

రెండో విడతలో విద్యార్థినికి ట్రిపుల్ ఐటీ సీటు


స్పందన

జే.పంగులూరు: మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అత్తింటి స్పందనకు ట్రిపుల్ ఐటీ సీటు లభించింది. మొదటి విడతలో ఈపాఠశాలకు 10 ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చాయి. రెండో విడత సీట్లు శుక్రవారం ప్రభుత్వం విడుదల చేయగా వాటిలో స్పందనకు శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ సీటు వచ్చింది. దీనితో చందలూరు పాఠశాలకు 11 మొత్తం సీట్లు వచ్చాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు స్పందనను అభినందించారు.

ఆకాశవాణి ప్రయోక్త వేణుగోపాల్‌కు సత్కారం


పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వేణుగోపాల్

అద్దంకి రూరల్: పొట్టి శ్రీరాములు జీవితంపై పరిశోధన నిమిత్తం శుక్రవారం అద్దంకి వచ్చిన ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్, జనరంజక విజ్ఞాన రచయిత, ఆకాశవాణి ప్రయోక్త నాగసూరి వేణుగోపాల్‌ను రోటరీ, సృజన, సాహితీ మిత్రమండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. దీనిలో భాగంగా స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి, పద్యశాసనం, ఎర్రన విగ్రహాలను సందర్శించి పూలమాలలు వేశారు. పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, చిన్ని మురళీ కృష్ణ, చుండూరి మురళీ సుధాకరరావు, చప్పిడి వీరయ్య, యు. దేవపాలన, డీవీఎం సత్యనారాయణ, నాగసూరి వెంకటసుబ్బారావు, లక్కరాజు చంద్రశేఖర్, తమ్మన శ్రీనివాసరావు, పసుపులేటి అంజనేయులు, అంజాద్‌బాషా,మాలాది శ్రీనివాసరావు, అళహరి హరిబాబు, అన్నంగి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పొలంబడితో రైతులకు ఉపయోగాలు


సాగుపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

వేటపాలెం: పొలంబడితో రైతులకు ఉపయోగాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామ పొలాల్లో రైతులకు పొలంబడి కార్యక్రమంలో భాగంగా సాగులో మెళుకువలపై శుక్రవారం అవగాహన కల్పించారు. రైతులు సాగుకు ముందుగా పచ్చిరొట్ట పైర్లతో భూమికి వచ్చే మేలు, విత్తనశుద్ధి గురించి వివరించారు. రైతుల సందేహాలను విని వారికి వాటిపై వివరణ ఇచ్చారు. ఏవో ఐ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ రాజేష్‌కుమార్, వీఏఏ చెన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు రోటరీ క్లబ్ సహకారం


మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

వేటపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థుల చదువులకు రోటరీ క్లబ్ సహకారం అందిస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పాపాయిపాలెం మండలం పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.5,500 విలువ చేసే నోట్ బుక్స్ విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ బాబూరావు, డివి సురేష్, వలివేటి మురళీ కృష్ణ, జీవై ప్రసాద్, ఎంవీ రామారావు, హరినారాయణ, హెచ్‌ఎం తన్నీరు లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్తమ సేవా ఆరోగ్యమిత్రగా అంజిరెడ్డి


కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న అంజిరెడ్డి

మార్టూరు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చాలా కాలంగా ఆరోగ్యమిత్ర సేవలందిస్తున్న గాదె అంజిరెడ్డి శుక్రవారం రాత్రి బాపట్ల జిల్లా కలెక్టర్ పీ రంజిత్ బాషా చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. బాపట్లలో అంజిరెడ్డికి జిలా కలెక్టర్ రూ.5 వేలు నగదుతో పాటు సేవా ఆరోగ్య మిత్ర ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డిని ఆసుపత్రి వైద్యులు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది, స్థానికులు అభినందించారు.

పచ్చరొట్ట.. భూసారంలో దిట్ట


సంతమాగులూరులో పచ్చిరొట్ట విత్తనాలు తీసుకుంటున్న రైతులు (ఫైల్)


తిమ్మాయపాలెం రైతు భరోసా కేంద్రం

- రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు
- పచ్చిరొట్ట పైర్లతో నేలసారం పెంపు
- రాయితీపై పిల్లిపెసర, జనుము, జీలుగల పంపిణీ
- నియోజకవర్గంలో 766 క్వింటాళ్లు పంపిణీ

అద్దంకి:

పూర్వం రోజుల్లో రసాయనిక ఎరువులు రాకముందు పకృతిలో దొరికే వ్యర్థాలనే ఎరువులుగా వేసి పంటలు పండించేవారు. కాల క్రమేణా జనాభా పెరగడం, హరిత విప్లవ స్ఫూర్తితో దిగుబడులు పెరిగాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఒక భాగమయ్యాయి. కాని ఎంత సాంకేతిక పెరుగుతున్నా పాత పద్ధతుల్లో పండించే వ్యవసాయానికే ఎక్కువ డిమాండ్ ఉంటుంది. రసాయన ఎరువుల విచ్చలవిడి వాడకంతో నేలసారం పూర్తిగా తగ్గిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈక్రమంలో సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులు నేల సారాన్ని కాపాడంలో ప్రముఖపాత్ర పోషిస్తాయి. నత్రజని శాతాన్ని పెంచడం కోసం ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేసింది. నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, కొరిశపాడు, జే పంగులూరు, సంతమాగులూరు మండలాల్లోని ఆర్‌బీకేల్లో పిల్లిపెసర, జీలుగ, జనుము, ఆహార భద్రతా పథకం కింద మినీ కందుల కిట్లతో కలుపుకుని మొత్తం 766 క్వింటాళ్లు సరఫరా చేశారు. ఆయా విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారలు రైతులకు పూర్తిగా పంపిణీ చేశారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ..

నియోజకవర్గంలోని 96 ఆర్బీకేల ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు రాయితీపై ఆయా విత్తనాలను అవసరమైన రైతులకు పంపిణీ చేసింది. కొందరు రైతులు ఇప్పటికే తమ పొలాల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేశారు. కొద్ది రోజుల్లో వాటిని నేలలో కలియదున్నడానికి సిద్ధమవుతున్నారు.

నేలలో నత్రజని పెంపు..

లెగ్యూమనేసి జాతి పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను నేలలో పూతకు వచ్చిన దశలో కలియదున్నుతారు. తద్వారా ఆయా పైర్ల వేరు బుడిపెల్లో గాలి నుంచి సేకరించి దాచి నత్రజనిని ఉంచుతాయి. వాటిని కలియదున్నడం వలన నేల సారం పెరుగుతుంది. తద్వారా ఎరువుల వినియోగం తగ్గి సాగు వ్యయం గణనీయంగా తగ్గుతుందని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలను వరి సాగు చేసే పొలాల్లో, చవుడు శాతం ఎక్కువగా ఉన్న పొలాల్లో పదేపదే చల్లి దున్నడం వల్ల చౌడు శాతం తగ్గి వ్యవసాయానికి అనువైన నేలలుగా మారుతాయి.

పచ్చిరొట్ట పైర్లతో ఉపయోగాలు..

- పచ్చిరొట్ట పైర్లు నేలలో కుళ్లేటప్పుడు జరిగే రసాయన ప్రక్రియల వల్ల పోషక పదార్థాలు మొక్కలకు సులభంగా అందుతాయి.
- పచ్చిరొట్ట పైర్లు సాగువలన నత్రజని ఎరువుల వాడకాన్ని 25–30 శాతం వరకు తగ్గించవచ్చు.
- నేల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి నేల కోతను కూడా అరికడుతుంది.
- పచ్చిరొట్ట ఎరువులు సంద్రియ ఎరువులు.
- నీటి ద్వారా నేలలో నేలు చేసే సూక్ష్మ జీవుల అభివృద్ధి చెంది మొక్కలకు రోగ నిరోధక శక్తిని అందిస్తాయి. అంతేకాకుండా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికడతాయి.
- భూమి గుల్లబారి పంట మొక్కల వేర్లకు అవసరమయ్యే గాలి, నీరు పుష్కలంగా అందుతాయి.
- దీర్ఘకాలిక పంటల్లో, పండ్లతోటల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పూత దశలో కలియదున్నడం వల్ల నేల సారవంతం అవుతుంది.
- చౌడు సమస్యను తొలిగించడంతో పాటు భూసార పరిరక్షణకు తోడ్పడతాయి.
- ముఖ్యంగా వరి సాగు చేసే ప్రాంతాల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల బియ్యంలో విటమిన్లు, మాంసకృత్తుల శాతం పెరిగినట్లు పరిశోధనా ఫలితాల్లో వెల్లడైంది. దిగుబడి కూడా దాదాపు 15-20 శాతం పెరుగుతుందని రుజువైంది.

పంపిణీ చేసిన పచ్చిరొట్ట విత్తనాలు..		
జనుము	137	క్వింటాళ్లు
జీలుగ	281	క్వింటాళ్లు
పిల్లిపెసర	46	క్వింటాళ్లు
కందులు	21	క్వింటాళ్లు

పచ్చిరొట్టతో పలు ఉపయోగాలు..

పొలంలో ప్రధాన పంట వేసేముందుగా పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి దున్నటం వల్ల అధికలాభాలున్నాయి. జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో చల్లి, పూతకు వచ్చిన తరువాత నేలలో కలియదున్నాలి. దీని వల్ల నత్రజని భూమిలో చేరుతుంది. తద్వారా ఎరువుల వినియోగం తగ్గుతుంది. పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కే వెంకటకృష్ణ, మండల వ్యవసాయాధికారి, అద్దంకి

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం, నాయకులు

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- రూ. 22 లక్షలతో చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్ ప్రారంభం

చీరాల: శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని 30వ వార్డు సమీపంలో మున్సిపల్ ఓరియంటెడ్ ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 22 లక్షలతో చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే కరణం, మున్సిపల్ చైర్మన్ జంజనం, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివారు ప్రాంతాలుగా పేరున్న వైకుంఠపురం, విఠల్‌నగర్, హరిప్రసాద్‌నగర్, ఉజిలీపేట, జవహర్‌నగర్, జయంతిపేట వాసులకు పార్కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిమ్ కోసం రైలు పట్టాలు దాటి వెళ్లకుండా ఉచితంగానే వ్యాయమం చేసుకునే అవకాశం ఉంటుందని, సెలవు దినాలలో పిల్లలు ఆడుకునేందుకు ఎంతో వీలుంటుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అందరూ పార్కును వినియోగించుకునేందుకు సిమెంట్ బల్లలు, లైటింగ్, ఫెన్సింగ్, ఆట సామగ్రిని ఏర్పాటు చేశారు. పెద్దలు సేదతీరేందుకు గాను సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. పార్కు ఏర్పాటు వలన శివారు ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పార్కులో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బీ జైసన్‌బాబు, డీఎస్పీ ప్రసాదరావు, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, కంపా అరుణ్, బత్తుల అనిల్‌కుమార్, మామిడాల రాములు, గోలిస్వాతి, తోకల అనిల్‌కుమార్, పొత్తూరి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైవే నిర్మాణానికి సహకారం అవసరం

చీరాల టౌన్: వాడరేవు-పిడుగురాళ్ల హైవే నిర్మాణానికి అందరి సహకారం అందించాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఉజిలీపేట వార్డు సచివాలయం వద్ద 167 హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణానికి పేరాల రెవెన్యూ గ్రామ పరిధిలో 15 ఎకరాలు భూమి అవసరం అవుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణ వేగవంతం చేస్తున్నారని చెప్పారు. రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వ నిబంధనలు, మార్కెట్ విలువ ఆధారంగా నష్ట పరిహారం అందిస్తామన్నారు. రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచి అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని తహశీల్దార్ కోరారు. అనంతరం రైతుల భూములకు సంబంధించిన అడంగళ్, 1-బీ, భూ రికార్డులు, పన్నుల వివరాల రికార్డులు పరిశీలించారు. సమావేశంలో డీటీ సురేష్‌కుమార్, ఆర్ఐలు శేఖర్, శంకర్, వీఆర్వోలు, రెవెన్యూ గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం


లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం కొరిశపాడు మండలం పమిడిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గడప గడపకు తిరుగుతూ స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిని బుక్‌లెట్‌ను అందించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా తమదే విజమన్నారు. ప్రతిపక్ష పార్టీ టీడీపీ రోజుకో మాట, పూటకో అబద్దంతో ప్రజలను మోసం చెస్తోందని విమర్శించారు. అద్దంకి నియోజకవర్గంలో జరిగినా అభివృద్ధిని చూసి టీడీపీకి నిద్ర పట్టడంలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తామని జోస్యం చెప్పారు. అనంతరం పమిడిపాడులో వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్న కుమారి, మాజీ సర్పంచ్ శ్రీధర్, మండల, సచివాలయ ఉద్యోగులు, గ్రామ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ముందంజ


సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

చీరాల అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ముందంజలో ఉందని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వీ ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివవరప్రసాద్, ఎస్టీయూ చీరాల బాధ్యులు రమణరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తిచేయాలి

మార్టూరు: నిర్మాణాలు జరుపుకుంటున్న సచివాలయాలు విలేజ్ క్లినిక్‌లు, ఆర్బీకే సెంటర్‌లు తదితర భవనాలు నెలాఖరులోగా పూర్తిచేసి బిల్లులు మంజూరు చేయించుకోవాలని ఎంపీడీవో కృష్ణకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జెడ్పీవైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ఎంపీపీ మండల అభివృద్ధి కోసం అధికారులు ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. అనంతం ఎంపీడీవో కృష్ణకుమారి మాట్లాడుతూ ఈ నెల 9 వతేదీ నుంచి 'మేరీ మాటీ–మేరీ దేశ్' (నా భూమి–నాదేశం) కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. చెరువులు అభివృద్ధి చేసిన చోట తప్పనిసరిగా శిలాఫలకాలు ఏర్పాటు చేయనున్నామని శిలాఫలకాల నమూనాను ప్రదర్శించారు. ఆయా గ్రామాల్లో అమర జవాన్‌లు, వీరులు ఉన్నట్లయితే వారి వివరాలను శిలాఫలకాలపై భవిష్యత్ తరాలకు తెలిసేలా ముద్రించనున్నట్లు ఆమె తెలిపారు. మండలంలోని మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితో పూర్తి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ బాబు, సీడీపీఓ సుభద్ర, ఈఓపీఆర్డీ సుబ్బారావు, మండల వైస్ ఎంపీపీ దాసం అశోక్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


శిలాఫలకం నమూనా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో కృష్ణకుమారి

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం


బల్లికురవలో కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పేరయ్య


నాగులపాడులో కిట్లు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ హనుమంతరావు

బల్లికురవ/అద్దంకి: పోషకాహారలోప నివారణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్నారని జిల్లా రైతు అధ్యక్షుడు, మండల పార్టీ కన్వీనర్ చింతల పేరయ్య పేర్కొన్నారు. శుక్రవారం బల్లికురవలో 492 మంది బాలింతలు గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో కిట్‌కు రూ. 1612 ఖర్చుఅవుతుందని రాష్ట్రంలోని 27 లక్షల మందికి ఈ కిట్లు సరఫరా చేస్తున్నట్లు పేరయ్య చెప్పారు. తీసుకున్న కిట్లను బాలింతలు, గర్భిణులు సకాలంలో సద్వియోగపరచుకోవాలని కోరారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో డీ. సుధ అధ్యక్షత వహించారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ కె. రవిబాబు, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, షేక్ శ్రీనువలి, సూపర్‌వైజర్లు సలోని, విజయనిర్మల, ఎంపీ పౌండేషన్ కోఆర్డినేటర్ పీ. హరిహరరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు చీర, సారె పసుపు కుంకుమతో సామూహిక సీమంతాలు చేపట్టారు.

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు అన్నారు. నాగులపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఆయన శుక్రవారం కిట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని పదో వార్డులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వార్డు కౌన్సిలర్ కొమ్మాలపాటి సుధీర్, 20వ వార్డులో కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు పంపిణీ చేశారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం


తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సిబ్బంది

జే.పంగులూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యమని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు మండల పరిధిలోని రామకూరు గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రం-1లో శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని, తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, మహిళా కానిస్టేబుల్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో దిగుబడులు

మార్టూరు: సమయానుకూలంగా మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులతో సరైన చర్యలు తీసుకోవటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారి బీ హనుమంత్ నాయక్ అన్నారు. మండలంలోని బొల్లాపల్లి, చాటివారిపాలెం గ్రామాల్లో మామిడి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు కాయ కోత అనంతరం కొమ్మ కత్తిరింపు విధానాన్ని అవలంభించాలన్నారు. సూక్ష్మధాతు మూలకాల లోపాలను నివారించటానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ

మార్టూరు: పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీకి గురైన విషయమై శుక్రవారం రాత్రి మార్టూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్సై కే కమలాకర్ వివరాల మేరకు.. ద్రోణాదుల గ్రామానికి చెందిన రైతుల భూముల్లో నీటి మోటార్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు శుక్రవారం ఉదయం రైతులు గుర్తించారు. ఈ క్రమంలో రైతులు విద్యుత్ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా గడచిన రెండు నెలల కాలంలో ద్రోణాదుల, బొబ్బేపల్లి గ్రామాలకు చెందిన 50 మందికి పైగా రైతుల మోటార్లలోని రాగి తీగలు చోరీకి గురైనప్పటికీ ఇంతవరకు పోలీసులు ఆచూకీ కనుగొనలేకపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్

కారంచేడు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఈఏడాది జరిగిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై ప్రతి గ్రామంలోనూ సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ప్రతి గ్రామంలో జరిగే సామాజిక తనిఖీలో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు జరిగిన అన్ని రకాల పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు తయారు చేస్తారన్నారు.

చైతన్యను కలిసిన సీఐ


చైతన్యకు బొకే అందజేస్తున్న సీఐ

అద్దంకి: పట్టణ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ శుక్రవారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్యను ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. పట్టణంలోని సమస్యల గురించి చర్చించారు.

వేమవరం గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

బల్లికురవ: మండలంలోని వేమవరం ఫ్యాక్షన్ గ్రామాన్ని శుక్రవారం బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఐదేళ్ల క్రితం జరిగిన జంట హత్యల సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న పోలీసు పికెట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీసు కేసులతో చిన్నాభిన్నమైన కుటుంబాలను ఆయన ఓదార్చారు. ఐక్యతతో ప్రశాంతంగా ఉండాల్సిన గ్రామంలో కక్షలు, కార్పణ్యాలు వద్దన్నారు. పరిశీలనలో ఎస్సైవీ వేమన, సిబ్బంది పాల్గొన్నారు.

21న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్రసభలు

అద్దంకి: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలు ఈ నెల21 నుంచి 22 వ తేదీ వరకు విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎన్జీవో అద్దంకి తాలూకా అధ్యక్షుడు గద్దల కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు వాల్‌పోస్టర్ శుక్రవారం ఎన్జీసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి తాళ్లూరి రమేష్ బాబు, ట్రెజరర్ ఏడుకొండలు, అర్జున్‌రావు, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, ప్రదీప్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

చినగంజాం: గృహ నిర్మాణ లబ్ధిదారులందరికీ న్యాయం జరిగేలా చూడాలని, వారికి సకాలంలో బిల్లులు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన గదిలో హౌసింగ్ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు అందరికీ బిల్లులు సకాలంలో పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది జోసెఫ్, టీ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పెదగంజాం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.